సాక్షి రంగారెడ్డి

బుధవారం, 30, ఏప్రిల్, 2025



హక్కుల సాధనకు..

హక్కుల సాధనకు కార్మికులంతా ఐక్యంగా పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు పిలుపునిచ్చారు. 8లో▸



కర్ణన్‌కు సమస్యల తో'రణం'

ఆహార కల్తీ నిరోధానికి ఆర్‌వీ కర్ణన్ హయాంలో జరిగినన్ని తనిఖీలు, దాడులు గతంలో ఎన్నడూ జరగలేదు. 8లో▸



క్యాబ్.. క్యా సాబ్!

మండుతున్న ఎండలతో పాటు క్యాబ్‌లు, ఆటోలు ప్రయాణికులను ఠారెత్తిస్తున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

మంత్రి సీతక్కను కలిసిన అధికారుల బృందం



ఆత్మనిర్భర్ అవార్డును మంత్రి సీతక్కకు చూపిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

యాచారం: స్థానిక ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీలత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కలిశారు. మాల్ గ్రామ పంచాయతీకి ఆత్మనిర్భర్ నేషనల్ అవార్డు రావడం, ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా రూ.కోటి ప్రోత్సాహకాన్ని అందుకున్న నేపథ్యంలో మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, ఇబ్రహీంపట్నం డివిజన్ డీఎల్‌పీఓ సాధన, మాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాజ్‌పేయి శత జయంత్యుత్సవం

హాజరవనున్న ఎంపీలు ఈటల, కొండా

మహేశ్వరం: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవాలను బుధవారం నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు టి.యాదీశ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాగారం పరిధిలోని కుండె వెంకటేశ్ ఫామ్ హౌస్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్‌గిరి, చేవెళ్ల ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్, కార్యక్రమ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి, పాపయ్య గౌడ్, జంగయ్య యాదవ్ హాజరవుతారని చెప్పారు. బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గ్రామాల్లో సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించండి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డికి మొక్క అందజేస్తున్న సీఐ, ఎస్‌ఐ

మాడ్గుల: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ వేణుగోపాల్ రావు, ఎస్‌ఐ రాఘవేందర్ మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామాల్లో సైబర్ క్రైంపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

బీజాపూర్ హైవే నిర్మాణంలో ప్రభుత్వాలు విఫలం



చేవెళ్లలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల: హైదరాబాద్– బీజాపూర్ జాతీయ రహదారిని నిర్మించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దారుణంగా విఫలమయ్యాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులు ఎన్‌జీటీ కోర్టుకు తప్పుడు నివేదిక అందించారని, ఈ కారణంగానే పనులను ఆపేయాలని న్యాయస్థానం ఆదేశించిందని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు మాత్రం రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి హైదరాబాద్– బీజాపూర్ హైవేను పూర్తి చేసేలా చొరవ చూపాలని కోరారు. లేదంటే ప్రజలను ఏకం చేసి ఉద్యమం చేపడుతామని స్పష్టంచేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, నాయకులు మాధవగౌడ్, తులసీరాజు, ఎల్లయ్య, విగ్నేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నక్కర్తమేడిపల్లి-పల్లెచెల్కతండా మధ్య పూర్తయిన ఫెన్సింగ్

ఫ్యూచర్‌కు ఫెన్సింగ్

యాచారంలో ఫార్మాసిటీకి సేకరించిన భూమిలో సర్వే పూర్తి

అర్హులకు పరిహారం



యాచారం మండలంలోని నాలుగు గ్రామాల్లో సిబ్బంది కృషి వల్లే ఫార్మాసిటీ భూముల సర్వే పూర్తయింది. ఫెన్సింగ్ పనులు సైతం చురుగ్గా కొనసాగుతున్నాయి. అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో పరిహారం అందక నష్టపోయిన రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నాం.

– అయ్యప్ప, తహసీల్దార్ యాచారం

సమష్టి భాగస్వామ్యంతో సర్వే



గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో భూముల సర్వే, ఫెన్సింగ్ పనులు సమష్టి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుంది. రైతులు సహకారంతో సర్వే పూర్తయింది. ఉన్నతాధికారుల ఆదేశాల పాటిస్తూ పనులు కొనసాగిస్తున్నాం.

– లిక్కి కృష్ణంరాజు, సీఐ, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్

- చురుగ్గా కొనసాగుతున్న కంచె నిర్మాణ పనులు
- మరో రెండు రోజుల్లో కందుకూరు పరిధిలో మరూ

యాచారం: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీకి సేకరించిన భూముల సర్వే, ఫెన్సింగ్ ఏర్పాటు పనుల్లో అధికార యంత్రాంగం పట్టువీడడం లేదు. ఈ నెల 3న మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి నుంచి ఈ పనులు ప్రారంభించారు. యాచారం–కడ్తాల్ సరిహద్దులోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, పల్లెచెల్కతండా, తాడిపర్తి గ్రామాల్లో సర్వే పూర్తయింది. 150 మందికి పైగా రెవెన్యూ, టీజీఐఐసీ, సర్వే, పోలీస్ సిబ్బంది ఈ పనుల్లో తలమునకలవుతున్నారు.

14 వేల ఎకరాలకు 90 కిలోమీటర్ల ఫెన్సింగ్

యాచారం, కందుకూరు మండలాల్లో 19,333 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించేందుకు అప్పటి బీఆర్‌ఎస్ సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు రెండు మండలాల పరిధిలో పది గ్రామాల్లో 14వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించారు. ఈ సేకరించిన భూముల చుట్టూ బౌండరీ ఏర్పాటుకు 90 కిలోమీటర్ల మేర ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ భూమిలో ఫోర్త్ సిటీ నిర్మించేందుకు నిర్ణయించిన విషయం విదితమే. ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యం అయ్యే ప్రముఖ సంస్థలకు భూములు అప్పగిస్తే భవిష్యత్‌లో రైతుల నుంచి చిక్కులు రావద్దనే ఉద్దేశ్యంతో రేవంత్‌రెడ్డి సర్కార్ భూముల సర్వే చేసి ఫెన్సింగ్ పనులకు పూనుకుంది. సర్వే, ఫెన్సింగ్‌కు కావాల్సిన ఏర్పాట్లను టీజీఐఐసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇక కందుకూరు మండలంలో..

నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీకి సేకరించిన భూముల బౌండరీ 45 కిలోమీటర్లు కాగా నేటికీ 15 కిలోమీటర్లకు పైగా ఫెన్సింగ్ పనులు పూర్తి చేశారు. పది రోజుల్లో యాచారం మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో ఫెన్సింగ్ పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. త్వరలో కందుకూరు మండల పరిధిలోని ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, మీరాఖాన్‌పేట తదితర గ్రామాల్లోని భూముల సర్వే పనులు మొదలు పెట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

మెడికల్ కాలేజీకి తాళం

- ప్రభుత్వం అద్దె చెల్లించడం లేదని భవన యాజమాన్యం ఆగ్రహం
- రెండు గంటల పాటు బయటే నిరీక్షించిన విద్యార్థులు, సిబ్బంది
- కలెక్టర్, ఆర్డీఓ చొరవతో తెరుచుకున్న గదులు



ఆరుబయట కుర్చున్న ప్రిన్స్‌పాల్

ఇబ్రహీంపట్నం రూరల్: అద్దె చెల్లించలేదనే కారణంతో మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు తాళం వేశారు. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు గంటల తరబడిగా ఆరుబయటే నిరీక్షించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదిబట్ల మున్సిపల్ పరిధి మంగళ్‌పల్లిలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కళాశాల కొనసాగుతోంది. గతేడాది అక్టోబర్‌లో కాలేజీని ప్రారంభించారు. ఈ సమయంలో నెలకు రూ.16 లక్షల చొప్పున అద్దె చెల్లించేలా భవన యాజమాన్యం ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. కానీ బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో, ఇదే ప్రాంగణంలోని మరో భవనంలో మెడికల్ కాలేజీతో పాటు తరగతులు నిర్వహిస్తున్నారు. సోమవారం క్లాసులు ముగిసిన అనంతరం భవన యజమానులు గదులకు తాళాలు వేసుకున్నారు. మెడికల్ కాలేజీ బోర్డును సైతం తొలగించారు. మంగళవారం ఉదయం కాలేజీకి వచ్చిన సిబ్బంది, విద్యార్థులు గదులకు తాళాలు, పక్కన పడేసిన బోర్డును చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. అద్దె చెల్లించడం లేదనే కారణంతోనే యజమానులే తాళాలు వేశారని తెలుసుకున్నారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.త్రివేణి ఈ విషయాన్ని కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. ఆయన ఆర్డీఓ అనంతరెడ్డిని కాలేజీకి పంపించారు. సమస్య పరిష్కారానికి అధికారులు హామీ ఇవ్వడంతో ఉదయం 11గంటలకు తాళాలు తెరుచుకున్నాయి. ఉదయం 9గంటలకే కళాశాలకు వచ్చిన విద్యార్థులు రెండు గంటల పాటు బయటే కూర్చున్నారు. ఇదిలా ఉండగా తమకు కేటాయించిన భవనాన్ని ఇవ్వలేదని ప్రిన్సిపాల్, అసలు అద్దె చెల్లించడం లేదని యజమానులు తెలిపారు.

సమాచార లోపంతోనే..

శాఖల మధ్య నెలకొన్న సమాచార లోపం కారణంగానే సమస్య తలెత్తిందని స్టేట్ మెడికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు తెలిపారు. మంగళవారం అన్ని కాలేజీలు, హాస్టళ్లకు సంబంధించిన అద్దెలు చెల్లించామని పేర్కొన్నారు. కాలేజీలు యథావిధిగా కొనసాగుతాయని, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పనిలేదని స్పష్టంచేశారు.



తాళం వేసిన తరగతి బయట వేచిన ఉన్న విద్యార్థులు



కడ్తాల్: మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ చల్లా

'భూ భారతి' రైతులకు చుట్టం

- రికార్డుల నిర్వహణకు గ్రామాల్లో రెవెన్యూ అధికారి నియామకం
- ప్రతీ కమతానికి భూదార్ కార్డు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ఆమనగల్లు: భూ భారతి చట్టం రైతులకు చుట్టమని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం భూ భారతి ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ నాగార్జున అధ్యక్షతన నిర్వహించిన ఈ అవగాహన సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రైతుల మేలును కాంక్షించి హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. పెండింగ్ సమస్యలకు ఈ చట్టంతో పరిష్కారానికి మార్గం ఏర్పడిందని ఆయన వివరించారు. భూ భారతి చట్టంలో రికార్డుల నిర్వహణకు ప్రతీ గ్రామానికి ఒక గ్రామ రెవెన్యూ పాలన అధికారిని నియమించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. జూన్ నుంచి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలకు సంబంధించి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతీ కమతానికి భూదార్ కార్డు కేటాయించి హద్దులతో కూడిన మ్యాప్‌ను పొందుపరుస్తామని చెప్పారు.

రైతుల శ్రేయస్సు కోసమే

రైతుల శ్రేయస్సు కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ధరణితో ఇబ్బందులు పడిన రైతులకు విముక్తి కలుగుతుందని ఆయన చెప్పారు. రైతుల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తారని ఆయన వివరించారు. ఈ సదస్సులో తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అజీం, అంజయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంఈఓ చంద్యానాయక్, వ్యవసాయాధికారి రేణుకా చక్రవర్తి పాల్గొన్నారు.

పరిహారం పెంచి ఇవ్వండి

కడ్తాల్ మీదుగా, మహేశ్వరం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వరకు బీదర్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వారు నిర్మిస్తున్న 765 కేవీ హైటెన్షన్ లైన్‌కు సంబంధించి భూముల విలువ ఆధారంగా పరిహారం పెంచి ఇవ్వాలని రైతులు కోరారు. ఈ మేరకు బాధిత రైతులు కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతులకు న్యాయం జరిగేలా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ మెంబర్ బాలాజీ సింగ్, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, ఏఎంసీ చైర్ పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి,, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, డైరెక్టర్లు వెంకటేశ్, శ్రీనివాస్, ఎంపీడీఓ సుజాత, ఏఓ శ్రీలత, మాజీ ఎంపీపీ వీరయ్య, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, నర్సింహ, బీక్యానాయక్, రాములుగౌడ్, లక్పతినాయక్, బీచ్యానాయక్, మహేశ్, లక్ష్మయ్య, రాములుయాదవ్ పాల్గొన్నారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి ఆర్ఓఆర్ చట్టంతో భూముల వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో భూ భారతిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు భూములపై యాజమాన్య హక్కులు కల్పించేందుకు భూ భారతి చట్టం దోహదపడుతుందని చెప్పారు.అనంతరం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రైతుల ఇబ్బందులను తీర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టం తీసుకువచ్చారన్నారు. తెలంగాణ స్టేట్ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఇబ్బందులు, పొరపాట్లకు తావులేకుండా భూ భారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో పేదలకే ప్రాధాన్యం

రాష్ట్ర హౌసింగ్ బోర్డు స్పెషల్ సెక్రెటరీ వీపీ గౌతమ్



మహేశ్వరం: లబ్ధిదారులతో మాట్లాడుతున్న వీపీ గౌతమ్, ప్రతిమాసింగ్

మహేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన, ఇల్లులేని పేదవారిని గుర్తించాలని రాష్ట్ర హౌసింగ్ బోర్డు స్పెషల్ సెక్రెటరీ వీపీ గౌతమ్ అన్నారు. మండల పరిధిలోని సిరిగిరిపురంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. సర్వే, ఎంపిక పారదర్శకంగా సాగుతోందన్నారు. గూడు లేనివారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, హౌసింగ్ పీడీ ధరావత్ చంప్లానాయక్, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శైలజ, తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి, పీఆర్ ఏఈ రామ్‌ప్రసాద్, ఆర్‌ఐ ప్రేమ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శితదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర హౌసింగ్ బోర్డు స్పెషల్ సెక్రెటరీ గౌతమ్ సూచించారు. మంగళవారం మంఖాల్, తుక్కుగూడలో మున్సిపల్ అధికారులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను హౌసింగ్ బోర్డు స్పెషల్ సెక్రెటరీ గౌతమ్ అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణి, మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బండమీదగూడూరులో అమెజాన్ సహకారంతో ముస్తాబైన అంగన్‌వాడీ కేంద్రం



అమెజాన్ సంస్థ అభివృద్ధి చేసిన గునుగల్ మోడల్ స్కూల్

అనుమతి లేదాయె!

- చెరువుల అభివృద్ధి పనులకు ముందుకు వచ్చిన అమెజాన్
- అనుమతులు నిరాకరించిన ఇరిగేషన్ శాఖ అధికారులు

కందుకూరు: సాధారణంగా నిధుల లేమితో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టకపోతే స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వాటిని పూర్తి చేస్తుంటాయి. రైతులకు అవసరమైన చెరువుల అభివృద్ధి పనులకు మాత్రం సంబంధిత శాఖ అధికారులు అనుమతులు నిరాకరిస్తున్నారు. దీంతో పనులు చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థ ప్రతినిధులు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు అలవోకగా చేపట్టిన వారికి చెరువుల అభివృద్ధి పనులకు అనుమతులు రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

అమెజాన్ ఆధ్వర్యంలో..

అమెజాన్ సంస్థ ప్రతీ ఏడాది వచ్చే లాభాల్లో మూడు శాతం నిధులను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)లో ప్రజా అవసరాలకు ఖర్చు చేస్తోంది. ఆ సంస్థకు కందుకూరు, షాబాద్ మండలాల్లో డాటా సెంటర్లున్నాయి. దీంతో ఆయా మండలాల పరిధిలో ఆరోగ్యం, విద్య, తాగు, సాగు నీటి వసతులపై సీఎస్ఆర్ నిధుల నుంచి ఖర్చు చేయడానికి ముందుకు వచ్చింది. రెండేళ్లుగా అవసరాన్ని బట్టి ప్రభుత్వ పీహెచ్‌సీలు, విద్యా సంస్థల అభివృద్ధితో పాటు గ్రామాల్లో తాగునీరు అందించేలా ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. దాదాపుగా ప్రతీ ఏడాది రూ.4 నుంచి రూ.5 కోట్ల నిధుల వరకు ఖర్చు చేయడానికి ఆ సంస్థ సిద్ధంగా ఉంది.

చెరువులకు రాని అనుమతులు

కాగా ఆయా మండలాల్లో ప్రతీ ఏడాది అభివృద్ధి పనులు చేపడుతున్న అమెజాన్ సంస్థ గతేడాది నుంచి చెరువుల అభివృద్ధి చేపట్టేందుకు యత్నిస్తోంది. షాబాద్, కందుకూరు మండలాల్లో మొదటి విడతలో పది చెరువులను తీసుకుని కట్టల పటిష్టత, అలుగు మరమ్మతులు, బతుకమ్మలు వదిలేందుకు మెట్ల నిర్మాణం, చెరువు కట్టలపై సోలార్ లైట్లు ఏర్పాటు వంటి వాటిని చేయాలని సంకల్పించింది. ఇందుకు గత ఏడాది ఫిబ్రవరిలో ఇరిగేషన్ అధికారులకు అనుమతుల కోసం లేఖలు రాసింది. ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలోనే వారు సూచించిన విధంగానే పనులు చేయాలని నిర్ణయించింది. అందుకు ఎన్ని మార్లు ఆ సంస్థ ప్రతినిధులు ఇరిగేషన్ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నా అనుమతులు ఇవ్వలేదు. దీంతో స్వచ్ఛందంగా పనులు చేయడానికి ముందుకు వచ్చినా అనుమతులు ఇవ్వకపోడంతో ఆ సంస్థ ప్రతినిధులు విచారం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అనుమతులు ఇప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇప్పటి వరకు చేపట్టిన పనులు

- మహేశ్వరం ఆస్పత్రిలో రూ.కోటి వెచ్చించి రెండో అంతస్తు నిర్మించింది.
- షాబాద్‌లో ఆస్పత్రి అభివృద్ధికి రూ.80 లక్షల వరకు ఖర్చు చేసింది.
- సబ్‌సెంటర్ల అభివృద్ధితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు పున:నిర్మించారు.
- గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటు, జిల్లా పరిషత్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన, ఓపెన్ జిమ్‌లు, పార్కుల అభివృద్ధి పనులు.
- రైతుల కోసం 200 వరకు ఫాంపండ్స్ నిర్మాణాలను చేపట్టింది.
- దాదాపుగా 30 వేల వరకు మొక్కలు నాటి వాటి సంరక్షణ చేపట్టింది.
- యాచారం మండలం గునగల్, కందుకూరు మండలం నేదునూరు మోడల్ స్కూళ్లలో అభివృద్ధి పనులు పూర్తి చేసింది.

ఏడాది క్రితమే కోరాం

బేగరికంచె గ్రామ పరిధిలోని బేగరి చెరువు, వావిళ్లకుంటలను అభివృద్ధి కోసం అమెజాన్ సంస్థను కోరాం. వాళ్లు ఇరిగేషన్ అధికారులకు ఏడాది క్రితమే అనుమతుల కోసం పంపామని చెప్పారు. ఇప్పటికీ అనుమతులు రాలేదు. త్వరగా అనుమతులు ఇస్తే చెరువుల అభివృద్ధి జరుగుతాయి.

– రూప్లానాయక్, వావిళ్లకుంటతండా, బేగరికంచె

ఉన్నతాధికారుల పర్మిషన్ అవసరం

కందుకూరు మండలంలో ప్రస్తుతం సున్నం చెరువు, కూసుకుంటల్లో అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. వావిళ్లకుంట, బేగరికంచె చెరువులకు సంబంధించి వాళ్లు దరఖాస్తు చేశారు. ఇంకా పై అధికారుల నుంచి అనుమతులు రాలేదు. వచ్చిన వెంటనే ఆ సంస్థ పనులు చేపడుతుంది.

– హబీబుద్దీన్, ఏఈ, ఇరిగేషన్

హక్కుల సాధనకు ఐక్య పోరాటం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: హక్కుల సాధన కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మేడేకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కార్మికులు ఎనిమిది గంటల విధానం కోసం అమెరికాలో చికాగో నగరంలో పోరాడి సాధించారని గుర్తు చేశారు. ఈ విజయాన్ని మే 1వ తేదీన మేడే గా జరుపుకొంటామని వివరించారు. కార్మికులు నేటికీ శ్రమ దోపిడీకి గురువుతున్నారని.. వారి పనికి తగిన వేతనం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యంత్రాల మధ్య పని చేస్తున్న కార్మికులకు సైతం యాజమాన్యాలు రక్షణ కవచాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఎర్ర తివాచీ పరిచి కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని విమర్శించారు. మేడే స్ఫూర్తితో కార్మికులు హక్కులు సాధనకు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్, కార్మికులు యాదయ్య, రాజు, జంగయ్య, అంజమ్మ, శంకరయ్య, కుమార్, శివ, చెన్న కేశవులు, కమలమ్మ, మమత, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



అరుంధతి (ఫైల్)



బసంత్‌బెహరా (ఫైల్)

మొయినాబాద్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన మొయినాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీలోని గుల్షన్ కాలనీకి చెందిన ఇంద్రపాటి సత్యనారాయణరెడ్డి భార్య అరుంధతి(50) మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో ఇంట్లోనే ఉంది. భర్త వాకింగ్‌కి వెళ్లి 8.30 గంటలకు ఇంటికి వచ్చే సరికి భార్య కనిపించలేదు. దీంతో ఆయన పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొంత కాలంగా తన భార్య ఆరోగ్యం బాగోలేదని.. కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఒడిశా వ్యక్తి..

కేశంపేట: ఆస్పత్రికి వెళ్తానని బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామ శివారులో ఉన్న వేంకటేశ్వర పౌల్ట్రీ ఫాంలో వాచ్‌మెన్‌గా పనిచేసేందుకు ఒడిశా నుంచి పిటీష్ బెహరా, బసంత్ బెహరా రెండేళ్ల క్రితం వచ్చారు. సోమవారం ఉదయం అనారోగ్యంగా ఉండటంతో బసంత్ బెహరా ఆస్పత్రికి షాద్‌నగర్ వెళ్తున్నట్టు తోటి వారికి చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో తోటి మిత్రుడు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం పోలీసులకు పిటీష్ బెహరా ఫిర్యాదు చేశారు.

ఆడుకుంటూ వెళ్లి అసువులు బాసింది

ప్రమాదశాత్తు చెరువులో పడి
6 ఏళ్ల చిన్నారి మృతి



అభిత (ఫైల్)

చైతన్యపురి: ఇంటి పక్క నుంచి ఆడుకుంటూ వెళ్లిన 6 ఏళ్ల బాలిక ప్రమాదవశాత్తు చెరువు నీళ్లలో పడి మృతిచెందిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన పాలకుర్తి శ్రీను, శ్రావణి దంపతులు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కూలిపనులు చేసుకుంటూ గ్రీన్ పార్కు కాలనీ రోడ్‌నం.14లో నివసిస్తున్నారు. వీరికి నలుగురు కూతుళ్లు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో తల్లిదండ్రులు పక్కింటివారితో మాట్లాడుతుండగా రెండో కూతురు అభిత (6) ఆడుకుంటోంది. కొద్ది సేపటి తర్వాత తర్వాత చూడగా అభిత కనిపించలేదు. ఎక్కడ వెతికినా జాడ తెలియకపోవటంతో రాత్రి సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు అభిత మృతదేహం చెరువు నీటిలో తేలుతూ కనిపించింది. ఇంటి సమీపంలోనే చెరువు ఉండటంతో బాలిక ఆడుకుంటూ వెళ్లి అందులో పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. తమ ఆరేళ్ల కూతురు మృతి చెందడంతో శ్రీను, శ్రావణి దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్కూటీని ఢీకొట్టిన ఆటో

మొయినాబాద్: స్కూటీని వెనక నుంచి అశోక్ లేలాండ్ ఆటో ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌కు చెందిన సయ్యద్ మోయిజ్ ఈ నెల 27న జేబీఐటీ నుంచి మెహదీపట్నానికి స్కూటీపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో వీఆర్‌కే కళాశాల వద్దకు రాగానే వెనక నుంచి అతివేగంతో వచ్చిన అశోక్ లేలాండ్ ఆటో ఢీకొట్టింది. దీంతో స్కూటీపై వెళ్తున్న మోయిజ్ కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి సోదరుడు ఎండీ ఫర్దీన్ మంగళవారం మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారుపై రాయితో దాడి

మొయినాబాద్: రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వెంబడించిన కారుపై రాయితో దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి అమ్డాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్డాపూర్‌కు చెందిన సామ మోహన్‌రెడ్డి సోమవారం రాత్రి 10.30 గంటలకు తన కారులో వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో గ్రామానికి చెందిన కుర్వ మల్లేశ్ ఈసీ వాగులో నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నాడు. వెనక నుంచి వెళ్తున్న తన కారుకు సైడ్ ఇవ్వకపోవడంతో మోహన్‌రెడ్డి ట్రాక్టర్‌ను వెంబడించాడు. అమ్డాపూర్‌లోని అయ్యప్ప ఆలయం సమీపంలో ఇసుక అన్‌లోడ్ చేసిన మల్లేశ్, తన ట్రాక్టర్‌ను వెంబడించిన కారుపై రాయి విసిరాడు. దీంతో అద్దం పగిలిపోయింది. వాహనం దిగిన మోహన్‌రెడ్డిపై సైతం రాళ్లతో దాడిచేయడంతో తప్పించుకుని వెళ్లి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయికులు

కేశంపేట: మండల కేంద్రంలో మేడే వాల్ పోస్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రెటరీ రాంచందర్ మంగళవారం ఆవిష్కరించారు. కేశంపేటలో నిర్వహించే మేడే వేడుకలను మండల వ్యాప్తంగా ఉన్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని ఆయన కోరారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం ఏఐటీయూసీ పాటుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాండు, జంగయ్య, బాలయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాల లేక.. వెతలు తీరక



పై చదువుల కోసం నగరానికి వెళ్తున్న విద్యార్థులు



తరగతి గదిలో విద్యార్థులు (ఫైల్)

- అధిక ఫీజులతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- మొయినాబాద్‌లో జూనియర్ కాలేజ్ ఏర్పాటుకు నిరీక్షణ

మొయినాబాద్‌రూరల్: ఉన్నత విద్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న ప్రభుత్వ పెద్దల మాటలు నీటి మీది రాతలుగా మారాయి. మండలానికో జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. మొయినాబాద్ మండలంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో 14 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. ఏటా 1400 నుంచి 1500 వరకు విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులవుతున్నారు. స్థానికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులకు భారంగా మారింది. ప్రైవేటు కళాశాలలో అధిక ఫీజులు చెల్లించలేమని వారు వాపోతున్నారు.

హామీలు ఘనం

మండలం, మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు నెరవేరలేదు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నాయకులు ఇచ్చిన వాగ్దానాలు పట్టించుకునే వారే లేరు. మళ్లీ ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం వచ్చినా కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కళాశాలకు మోక్షం ఎప్పుడని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీ నెరవేర్చలేదు

మొయినాబాద్ మండలంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వం కళాశాల ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా వచ్చే విద్యా సంవత్సరానికి కళాశాలను నిర్మిస్తే పేద విద్యార్థులకు ఎంతో బాగుంటుంది.

– ముస్కాన్, విద్యార్థిని, పదో తరగతి, హిమాయత్‌నగర్

కలగానే మిగిలింది

మండలంలో కళాశాల లేక పేద విద్యార్థులు పై చదువులకు వెళ్లాలంటే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా కళాశాల ఏర్పాటు చేస్తే పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు మేలు జరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కళాశాలను ఏర్పాటు చేయాలి.

– మంజుల, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, హిమాయత్‌నగర్

మట్టి ట్రాక్టర్ సీజ్

మాడ్గుల: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులోని వాగు నుంచి మంగళవారం ఉదయం అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు మట్టి ట్రాక్టర్‌ను గమనించి ప్రశ్నించగా ఎలాంటి అనుమతులు లేవని చెప్పడంతో సీజ్ చేసినట్లు చెప్పారు. డ్రైవర్, వాహన యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కేసీఆర్ కటౌట్ దహనం చేసేందుకు యత్నించిన నిందితుడి అరెస్టు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్ ముందు ఏర్పాటుచేసిన 50 అడుగుల కేసీఆర్ కటౌట్‌ను దహనం చేసేందుకు యత్నించిన వ్యక్తిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా నాలుగు రోజుల క్రితం తెలంగాణ భవన్ ముందు మాజీ సీఎం కేసీఆర్ నిలువెత్తు కటౌట్‌ను ఏర్పాటుచేశారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో తిరుపతికి చెందిన ఎడవల్లి రాజా (35) అనే వ్యక్తి అగ్గి పుల్లతో దహనం చేసేందుకు అంటించాడు. అదే సమయంలో అటు నుంచి వెళ్తున్న మంజునాథ్ అనే వ్యక్తి కటౌట్ కాలుతున్న విషయాన్ని గమనించి దగ్ధం చేస్తున్న రాజాను పక్కకు తోసి తెలంగాణ భవన్ సెక్యూరిటీని అప్రమత్తం చేశాడు. క్షణాల్లో అక్కడికి చేరుకున్న సెక్యూరిటీ సిబ్బంది మంటలను ఆర్పి నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. ఎడవల్లి రాజా తిరుపతి గాంధీపురంలో ఉంటాడని, ఇటీవల మతిస్థిమితం కోల్పోయాడని, ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుంటాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. కటౌట్‌ను ఎందుకు దహనం చేయాలనుకున్నాడో పోలీసులు ఆరా తీస్తున్నారు.

కర్ణన్‌కు సమస్యల తో'రణం'



- కొత్త కమిషనర్‌కు బల్దియాలో సవాలక్ష సమస్యలు
- పరిపాలన నుంచి ప్రజా ఫిర్యాదుల దాకా..

సాక్షి, సిటీబ్యూరో: ఫుడ్‌సేఫ్టీ కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా జరుగుతున్న ఆహార కల్తీ నిరోధానికి ఆయన హయాంలో జరిగినన్ని తనిఖీలు, దాడులు గతంలో ఎన్నడూ జరగలేదు. చిన్న హోటళ్ల నుంచి స్టార్ హోటళ్ల దాకా వేటినీ వదల్లేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆయన ఆ పదవిలోకి రాకముందు ఎన్ని తనిఖీలు జరిగేవో తెలియదు. కానీ.. కర్ణన్ ఆ హోదాతో ప్రజారోగ్యంపై తగిన శ్రద్ధ చూపించారనే చెప్పాలి. కానీ.. జీహెచ్ఎంసీ కమిషనర్ పోస్టులోనూ అదేవిధంగా పని చేయడం కష్టమనే చెప్పాలి. ఆ శాఖలో పరిమిత సిబ్బంది, పరిమిత విధులు. జీహెచ్ఎంసీ కోటిమందికి పైగా ప్రజలకు ఒక్కటని కాదు రకరకాల సేవలందించే విభాగం. కుక్కకాట్ల నుంచి మొదలు పెడితే వరద కాలువల వంటి ప్రాజెక్టుల దాకా ఎన్నింటికో బాధ్యత వహించాలి, ఆస్తిపన్ను విధింపుల్లో అవకతవకలు, టౌన్‌ప్లానింగ్ అక్రమాలు, బర్త్, డెత్ సర్టిఫికెట్లలో లొసుగులు, పారిశుద్ధ్య సమస్యలు, దోమల బెడద.. ఇలా చెబుతూ పోతే సమస్యలకు అంతే ఉండదు.

పట్టు సాధించేనా?

ఆయా విభాగాలకు నేతృత్వం వహించే వారి నుంచి దిగువస్థాయి వారి దాకా సమన్వయంతో పని చేయాలి. ఎన్నికలొచ్చినా, ఓటర్ల జాబితాలు సరి చేయాలన్నా జీహెచ్ఎంసీ కమిషనర్‌దే బాధ్యత. జీహెచ్ఎంసీలో దీర్ఘకాలంగా పాతుకుపోయిన సిబ్బంది అక్రమాలు, అవతవకలు ఒక పట్టాన ఎవరికీ తెలియవు. వాటిని కనిపెట్టడంలో ఇలంబర్తి కొంతమేర సఫలమయ్యారనే చెప్పాలి. అక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు వెనుకాడకుండా 27 మంది ఔట్ సోర్సింగ్ ఇంజినీర్లను ఇంటికి పంపడం ఇందుకు మచ్చుతునక. జీహెచ్ఎంసీకి ఉన్న ఆస్తులెన్నో, వాటిద్వారా రావాల్సిన ఆదాయమెంతో, అందులో ఖజానాకు చేరుతున్నదెంతో సిబ్బంది సొంత జేబుల్లోకి మళ్లుతున్నదెంతో తెలుసుకునేందుకూ ఇలంబర్తి శ్రీకారం చుట్టారు.

➡ ఇలంబర్తి పని తీరు తెలిసి, ఆయన ఎప్పుడు వెళ్తారో అని చూసిన అధికారులెందరో ఉన్నారనడం అతిశయోక్తి కాదు. ఫుడ్‌సేఫ్టీ విభాగంలో నిర్వహించిన విధులతో జీహెచ్ఎంసీ గురించీ కర్ణన్‌కు తెలిసి ఉండవచ్చు. కానీ.. అక్కడిలా వ్యవహరించడం ఇక్కడ కుదరదని చెబుతున్నారు. జోనల్, అడిషనల్, డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ తదితర ఎన్నో విభాగాల అధికారులకు పనులప్పగించడం.. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ఫ్లై ఓవర్ల వంటి పనులు, రోడ్ల సమస్యలు ఇలా ఎన్నింటి గురించో సరైన అవగాహన రావడానికే సమయం పట్టనుంది. ఎంత వ్యవధిలోగా పట్టు సాధించి, సరైన పాలనతో ప్రజల సమస్యలు పరిష్కరించగలరో తెలిసేందుకు సమయం పట్టనుంది.

ఫుడ్‌సేఫ్టీ కమిషనర్‌గా జడ్సీలకు బాధ్యతలు

సాధారణంగా జీహెచ్ఎంసీలోని అధికారులు, సిబ్బందికి పోస్టింగులిచ్చేది, బాధ్యతలప్పగించేది జీహెచ్ఎంసీ కమిషనర్. కానీ, కర్ణన్ ఫుడ్‌సేఫ్టీ కమిషనర్‌గానే జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లకు సైతం బాధ్యతలప్పగించడం ఈ సందర్భంగా గమనార్హం. ఆహార కల్తీకి పాల్పడే హోటళ్లు, సంస్థల లైసెన్సులు రద్దు చేసే అధికారాలు జోనల్ కమిషనర్లకు అప్పగిస్తూ వారిని ఇన్‌చార్జి ఫుడ్‌సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్లుగా నియమించారు. కల్తీకి పాల్పడే వారిపై త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు జోనల్ కమిషనర్లకు బాధ్యతలప్పగించారు. అంతేకాదు, ప్రభుత్వ నిర్ణయానికనుగుణంగా జీహెచ్ఎంసీ పరిధిలో జోన్‌కొకటి చొప్పున ఆరు ఆహారపరీక్షల కేంద్రాల ఏర్పాటుకూ చర్యలు చేపట్టారు.

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కర్ణన్



జీహెచ్ఎంసీ కొత్త కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్ మంగళవారం ఇలంబర్తి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇద్దరు అధికారులకు జీహెచ్ఎంసీ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమిషనర్ కర్ణన్ మేయర్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రాండ్ వెల్‌కమ్..

లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆర్‌వీ కర్ణన్‌కు మంగళవారం ఘన స్వాగతం లభించింది. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్, రిక్షా కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్, జీహెచ్ఎంజీ అధ్యక్షుడు కాత్రావత్ గోపాల్ నాయక్, ఖైరతాబాద్ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్, కోశాధికారి పరశురాములు, మీడియా ఇన్‌చార్జి మూడవత్ మహేష్, కోఆర్డినేటర్ మచ్చగిరి, కార్యదర్శి ప్రభాకర్, లక్ష్మణ్, భాషా, హతీరాం తదితరులు ఉన్నారు.

అన్నదమ్ముల మిస్సింగ్



గౌస్, సమీర్ (ఫైల్)

పహాడీషరీఫ్: బాలురైన ఇద్దరు అన్నదమ్ములు అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ అఫ్రోజ్ కుమారులు మహ్మద్ గౌస్(11), మహ్మద్ సమీర్(9) ఈ నెల 27వ తేదీన ఇంటి బయటికి వెళ్లిన మేకలను తీసుకొస్తామంటూ వెళ్లారు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి సల్మాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వీరి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62366 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి

జవహర్‌నగర్: రీల్స్ చేస్తూ ఓ యువకుడు క్వారీ గుంతలో పడి మృతిచెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..కౌకూర్ భరత్‌నగర్‌లో నివసించే రమేష్ చిన్న కుమారుడు తరుణ్ (17) ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. మూడు రోజుల్లోనే తరుణ్ పుట్టినరోజు ఉండటంతో ఫొటోషూట్ చేద్దామని తన ఐదుగురు స్నేహితులతో కలిసి మల్కారంలోని గుట్టలు, పక్కనే ఉన్న క్వారీ గుంత వద్దకు సోమవారం సాయంత్రం వచ్చారు. తరుణ్ ఫోటో దిగుతూ క్వారీ గుంతలోకి దిగడానికి ప్రయత్నించగా..లోతు తెలియక, ఈత రాక మునిగిపోయాడు. తరుణ్‌ని బయటకు తీసేందుకు స్నేహితులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే జవహర్‌నగర్ పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

క్యాబ్.. క్యా సాబ్!

- రద్దీ వేళల్లో, సర్‌చార్జీల పేరుతో రెట్టింపు వసూళ్లు
- మండుతున్న ఎండలతో ఆటోలు, క్యాబ్‌లకు డిమాండ్
- ప్రయాణికులను అడ్డగోలుగా దోచేస్తున్న వైనం
- ఏళ్లు గడిచినా అమలుకు నోచుకోని సిటీక్యాబ్ చట్టం

సాక్షి, సిటీబ్యూరో: మండుతున్న ఎండలతో పాటు క్యాబ్‌లు, ఆటోలు ప్రయాణికులను ఠారెత్తిస్తున్నాయి. రద్దీ వేళల నెపంతో అడ్డగోలుగా సర్‌చార్జీలు విధిస్తూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలపై ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో ఇష్టారాజ్యంగా చార్జీల వసూళ్లకు దిగుతున్నాయి. మరోవైపు ప్రయాణికుల నుంచి తీసుకొనే చార్జీల్లో కమీషన్‌ల పేరిట క్యాబ్ సంస్థల ఖాతాల్లోకి పెద్ద మొత్తంలో చేరుతున్నాయని, రాత్రింబవళ్లు వాహనాలు నడిపే తమకు ఎలాంటి మిగులుబాటు ఉండడం లేదని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిరోజూ 5,000 క్యాబ్‌లు..

నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నిత్యం సుమారు 5,000 క్యాబ్‌లు రాకపోకలు సాగిస్తాయి. బంజారాహిల్స్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు సుమారు 32 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సాధారణంగా అయితే రూ.450 నుంచి రూ.500 వరకు చార్జీ అవుతుంది. ప్రస్తుత వేసవి రద్దీని సాకుగా చూపుతూ క్యాబ్ సంస్థలు రూ.750 నుంచి రూ.800 వరకు చార్జీలు విధిస్తున్నాయి. ఇలా ప్రయాణికుల నుంచి అధికంగా వసూలు చేస్తున్నప్పటికీ ఎయిర్‌పోర్టుకు క్యాబ్‌లు నడిపేందుకు డ్రైవర్లు నిరాకరిస్తున్నారు. అలాగే కార్లలో ఏసీ సదుపాయాన్ని నిలిపివేస్తున్నారు. క్యాబ్ సంస్థలు విధించే చార్జీల వల్ల ఒకవైపు ప్రయాణికులు, మరోవైపు క్యాబ్ డ్రైవర్లు కూడా అన్యాయానికి గురవుతున్నట్లు ఆర్టీఏ అధికారి ఒకరు విస్మయం వ్యక్తం చేశారు.

రద్దీ లేకున్నా సర్‌చార్జీలు..

సాధారణంగా ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయంలో ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో వాహనాలు అందుబాటులో లేనప్పుడు సర్‌చార్జీలను విధిస్తారు.10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న క్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు ఇలా అదనపు వడ్డింపులకు పాల్పడుతున్నారు. నిజానికి మోటారు వాహన చట్టం ప్రకారం ప్రజారవాణా వాహనాలకు రద్దీ సమయాలు, రద్దీ లేని సమయాలు అంటూ ప్రత్యేకమైన తేడాలు లేవు. అన్ని వేళల్లోనూ ఒకే విధమైన చార్జీలను వసూలు చేయాలి. కానీ.. ఇందుకు భిన్నంగా కొన్ని క్యాబ్ సంస్థలు సర్‌చార్జీలను విధిస్తున్నాయి. ప్రయాణికులు క్యాబ్ బుక్ చేసుకున్నప్పుడు నమోదైన చార్జీలకు అదనంగా రూ.50 నుంచి రూ.100 వరకు విధిస్తున్నారు.

➡ క్యాబ్‌లకు ఎక్కువ డిమాండ్ ఉండే హైటెక్‌సిటీ, మాదాపూర్, కొండాపూర్ తదితర ఐటీ కారిడార్ల నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. మరోవైపు ఆటోల్లో సైతం అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారు. క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలతో అనుసంధానమైన ఆటోల్లో ఒక్కోసారి క్యాబ్‌ల కంటే ఎక్కువ చార్జీలు నమోదు కావడం గమనార్హం. సాధారణంగా తిరిగే ఆటోల్లో మీటర్ రీడింగ్‌తో నిమిత్తం లేకుండా ఇష్టారాజ్యంగా వసూళ్లకు దిగుతున్నారు. అంతర్జాతీయ క్యాబ్ సంస్థలు విధించే చార్జీలపై ప్రభుత్వానికి ఎలాంటి నియంత్రణ లేకుండా పోయింది. ఆటో, ట్యాక్సీ చట్టాలు అమలు కావడం లేదు.

త్వరలో 'సహకార్ ట్యాక్సీ'

దేశవ్యాప్తంగా ఓలా, ఉబెర్ తదితర క్యాబ్ సంస్థలకు పోటీగా కేంద్రం సరికొత్త మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేపట్టింది. 'సహకార్ ట్యాక్సీ' పేరుతో రానున్న ఈ యాప్ డ్రైవర్ల సహకార సంస్థగా పని చేయనుంది. ఈ యాప్‌లో నమోదైన డ్రైవర్ల సేవలకు తగిన ఫలితం వారి ఖాతాల్లో చేరిపోతుంది. సహకార్ ట్యాక్సీ నిర్వహణ కోసం మాత్రం నామమాత్రంగా కొంతమొత్తాన్ని డ్రైవర్ల నుంచి తీసుకుంటారు. ఈ మొబైల్ యాప్ అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఊరట లభించనుంది.